క్లుప్తంగా

కొనసాగుతున్న సర్వే



జడ్చర్ల టౌన్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం చేస్తున్న సర్వే మున్సిపాలిటీలో ఆదివారం సైతం కొనసాగింది. మున్సిపల్ వార్డు అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకెళ్లి వివరాలు సేకరించారు. పాతబజార్ 6వ వార్డు హరిజనవాడలో సర్వేను కౌన్సిలర్ రమేష్ పర్యవేక్షించారు. అర్హులైన వారి జాబితా సిద్ధం చేసేందుకు ఇంటింటికి తిరుగుతున్నట్లు ఆయన తెలిపారు.

హజ్‌యాత్ర అవకాశం రావడం అదృష్టం



స్టేషన్ మహబూబ్‌నగర్: హజ్‌యాత్ర చేయడానికి అవకాశం రావడం అదృష్టమని ప్రముఖ ధార్మికవేత్త మౌలానా తస్లీం అన్సారీ అన్నారు, జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని జేజేఆర్ గార్డెన్స్‌లో సొసైటీ జిల్లా అధ్యక్షుడు మహమూద్‌అలీ అధ్యక్షతన ఆదివారం హజ్ యాత్రికులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తస్లీం అన్సారీ హజ్‌యాత్రపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. యాత్రికులు హజ్‌యాత్రపై సంపూర్ణ అవగాహన ఏర్పరుచుకోవాలని కోరారు. హజ్ యాత్రికులు ఇలాంటి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా హజ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మహెమూద్‌అలీ, మేరాజుద్దీన్, రవూఫ్‌పాష, సత్తార్, మహ్మద్ రఫీక్, ఖాజా నిజాముద్దీన్, మహ్మద్ ఫైజొద్దీన్, సయ్యద్ నిజాముద్దీన్, అహ్మద్ పటేల్, రజాక్, ఎండీ.ఇలియాజ్, మూసా, సిరాజుద్దీన్, రఫీక్ ఉర్ రహెమాన్, ఎండీ.అర్షద్‌అలీ, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్‌గా రామకృష్ణ

జడ్చర్ల టౌన్: వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్‌గా జడ్చర్లకు చెందిన మేడిశెట్టి రామకృష్ణ ఎన్నికయ్యారు. తమిళనాడు మధురైలో జరిగిన వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో అధ్యక్షుడు ఇరుకుల్ల రామకృష్ణ నియామకపు పత్రంను ఆదివారం అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. డైరెక్టర్‌గా ఎన్నికై నందుకు ఆర్యవైశ్య సంఘాల నాయకులు రామకృష్ణకు అభినందనలు తెలిపారు. సమాజంలోని పేదలు, అన్నివర్గాలకు సేవలు అందిస్తానని వెల్లడించారు.

మాజీ సైనికుడి కుటుంబానికి ఆర్థికసాయం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇటీవల మృతి చెందిన మాజీ సైనికుడు ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులకు మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో రూ.1.20లక్షలు ఆర్థికసాయం అందించారు. ఆదివారం మోతీనగర్‌లోని ప్రవీణ్‌కుమార్ ఇంట్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైవీ రావు, మల్లేష్, హనుమంతు, మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, నాగేశ్వర్ పాల్గొన్నారు.

బెస్త గంగపుత్ర సంఘం కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ రూరల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బెస్త గంగపుత్ర సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని న్యూప్రేమ్‌నగర్‌లో సంఘం నాయకులు సమావేశమై ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా చెర్క అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా గాండ్ల నరేందర్‌ను ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా అల్లె నాగయ్య, పెంటయ్య, కోశాధికారిగా పల్లెల యాదయ్య, గౌరవ అధ్యక్షుడిగా వేణుగోపాల్, సహాయ కార్యదర్శులుగా లక్ష్మీనారాయణ, సుధాకర్, రాజు, సందీప్, అంజి, భాస్కర్, శివకుమార్, లింగయ్య, శ్రీను, గోపాల్, నారాయణ, జంగయ్య, నర్సిములు, అల్లె శ్రీను, మొగులయ్యను ఎన్నుకున్నారు.

సర్దార్ వల్లభాయ్‌పటేల్‌కు ఘన నివాళి

జడ్చర్ల టౌన్: సర్దార్ వల్లభాయ్‌పటేల్ వర్ధంతిని పురస్కరించుకుని ఎస్‌వీపీనగర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తుకు చేసుకున్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు జైపాల్‌రెడ్డి, పరశురాం, అనిల్, రాధాకృష్ణ, అగర్వాల్, తరుణ్, భార్గవ్, వినయ్, యశ్వంత్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే కార్పొరేషన్

- విధివిధానాలు రూపొందిస్తున్న అధికారులు
- ఇప్పటికే సీఎం దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- పాలమూరులో దివిటిపల్లి, జైనల్లీపూర్ విలీనమయ్యే అవకాశం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: త్వరలోనే పాలమూరు మున్సిపాలిటీ కార్పొరేషన్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనికోసం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తీవ్రంగా యత్నిస్తున్నారు. ప్రస్తుతం 49 వార్డులతో సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా కొనసాగుతోంది. వచ్చే నెల 27వ తేదీ నాటికి పాలక వర్గం పదవీకాలం ముగియనుంది. ఆ తర్వాత కార్పొరేషన్ స్థాయిలోనే ఎన్నికలు జరగనున్నట్లు తెలుస్తోంది. ఏడాదిన్నర క్రితమే బీఆర్‌ఎస్ హయాంలోనే ఇందుకు సంబంధించిన అన్ని వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినా పెండింగ్‌లోనే పడింది. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరోసారి దీనిపై పాలకులు దృష్టి సారించారు.

కలవనున్న రెండు పంచాయతీలు

ఇప్పటికే పాలమూరు మున్సిపాలిటీ పరిధిలో సుమారు 2.88 లక్షల జనాభా ఉంది. కార్పొరేషన్‌గా మారాలంటే కనీసం మూడు లక్షల జనాభా అవసరం. దీంతో పట్టణ శివారులోని దివిటిపల్లి, జైనల్లీపూర్ గ్రామ పంచాయతీలను కలపాలని అధికారులు తాజాగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. 49 వార్డులకు మరో రెండు పెరిగి 51 డివిజన్లుగా మారనుంది. ఒక్కో డివిజన్‌లో 5,500 నుంచి ఆరు వేల వరకు జనాభా, నాలుగైదు వేల లోపు ఓటర్లు ఉండేలా చూస్తున్నారు.

ఈ పదేళ్లలో ఎంతో మార్పు

తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ పదేళ్ల కాలంలో మహబూబ్‌నగర్ పట్టణం వేగంగా విస్తరించింది. ఎన్నో కొత్త కాలనీలు వెలిశాయి. విద్య, వైద్య రంగాలతో పాటు రోడ్లు, రవాణా సౌకర్యాలు బాగా పెరిగాయి. రెండేళ్ల క్రితమే భూత్పూర్ రోడ్డులో కొత్త కలెక్టరేట్‌తో పాటు ఏనుగొండ నుంచి పాలకొండ మీదుగా బైపాస్ ఏర్పాటయ్యాయి. మరో వైపు భూత్పూర్– చించోలి జాతీయ రహదారికి సంబంధించిన పనులు వేగంగా నడుస్తున్నాయి. అలాగే ఎదిర, దివిటిపల్లి, అంబట్‌పల్లి మధ్య ఐటీ పార్కు సైతం అందుబాటులోకి వచ్చింది.

సీఎంకు విన్నవించిన ఎమ్మెల్యే

ఇలాంటి తరుణంలో ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కలిసి కార్పొరేషన్‌గా మార్చాలని విన్నవించారు. దీనికి ముఖ్యమంత్రి సైతం సానుకూలంగా ఉన్నట్లు కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ఆ మేరకు కసరత్తు చేయాలని ఉన్నతాధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పాలమూరు కార్పొరేషన్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇదే విషయాన్ని ఆదివారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వెల్లడించడం గమనార్హం.

అలరించిన క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పాస్టర్ వరప్రసాద్ తదితరులు

- పాస్టర్ల ప్రత్యేక ప్రార్థనలు
- పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కల్వరి మెన్నోనైట్ బ్రదరన్(ఎంబీ) చర్చి ఆవరణలో ఆదివారం రాత్రి నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు అలరించాయి. కల్వరి ఎంబీ గాయక బృందం ఆధ్వర్యంలో భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాస్టర్లతో కలిసి కేక్‌కట్ చేశారు. క్రైస్తవ సోదరులు కొవ్వొత్తులను వెలిగించి ప్రదర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్నట్లు తెలిపారు. చర్చి చైర్మన్, సీనియర్ పాస్టర్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకొని చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎంబీ చర్చి వైస్ చైర్మన్ బీఐ.జేకబ్, కార్యదర్శి జేఐ.డేవిడ్, సహాయ కార్యదర్శి కేఏస్.ఇమాన్యుయేల్ రాజ్, కోశాధికారి టీఏ.స్టిఫెన్, సహాయ కోశాధికారి ఎ.టైటస్ రాజేందర్, డికాన్స్‌తోపాటు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ పాల్గొన్నారు.

పాలకులం కాదు.. మేము సేవకులం

మహబూబ్‌నగర్ రూరల్: పాలకులమే కాదు.. మేము సేవకులం అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టంచేశారు. ఆదివారం మండలంలోని రాంరెడ్డిగూడెం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో శ్రమదానం చేసి కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను ఉత్తేజ పరిచారు. చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. జేసీబీ నడిపి ముళ్ల చెట్లను తొలగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవలే పాఠశాల, కళాశాల మైదానంలో సాయంత్రంవేళ విషసర్పాలు, అడవి పందులు వస్తున్నాయని ప్రిన్సిపాల్ వాణిశ్రీ తన దృష్టికి తీసుకొచ్చారు. అందుకే తమ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాఠశాల ఆవరణలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారన్నారు. జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, సాయిబాబా, గోవింద్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రత్యేకపూజలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకుని ఆదివారం వీరన్నపేట డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రాంతంలోని, అలాగే తూర్పుకమాన్ సమీప ఆలయాల్లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంబీసీ కాంపౌండ్‌లో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కౌన్సిలర్ బురుజు సుధాకర్‌రెడ్డి, కల్వరి ఎంబీ చర్చి చైర్మన్ ఎస్.వరప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్నాంజనేయ స్వామి రథోత్సవం



దేవరకద్ర: మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున ప్రసన్న ఆంజనేయస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. శనివారం నుంచి దేవాలయంలో అఖండ భజనలు కొనసాగాయి. తెల్లవారుజామున స్వామివారి ఉత్సవమూర్తిని దేవాలయం నుంచి రథంపైకి తీసుకొచ్చారు. వందలాది మంది భక్తులు స్వామి రథాన్ని లాగుతూ పట్టణంలోని ప్రధాన రహదారి గుండా ఊరేగించి ఉదయం 7గంటలకు రథోత్సవం దేవాలయానికి చేరుకుంది. ఆంజన్న నామస్మరణతో పట్టణం మార్మోగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

రాష్ట్రస్థాయిలో విజేతగా నిలవాలి

- మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్



ఎంపికలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో జిల్లా జట్టు ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఆదివారం జిల్లా జూనియర్ బాల, బాలికల కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ నిరంతరం ప్రాక్టీస్‌తోనే క్రీడల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ మాట్లాడుతూ జనగాంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర, మల్కాజ్‌గిరిలో ఈనెల 22 నుంచి 25 వరకు రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ టోర్నీలు ఉంటాయని తెలిపారు. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా దాదాపు 140 మంది బాలురు, బాలికలు హాజరయ్యారు. వీరిలో 14మంది బాలికలు, 16 మంది బాలురను ప్రాబబుల్స్‌గా ఎంపిక చేశారు. వీరికి ఈనెల 17 నుంచి ప్రత్యేక కోచింగ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. క్యాంపులో ప్రతిభ కనబరిచినవారిని తుది జట్లకు ఎంపిక చేస్తామన్నారు. జిల్లా కబడ్డీ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శులు ఆర్.బాల్‌రాజు, పాపారాయుడు, సభ్యులు ముత్యం గురుస్వామి, రాంచంద్రయ్య, నర్సింలు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. వేంకటేశ్వరుడి కల్యాణం



జడ్చర్ల టౌన్: పౌర్ణమిని పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం రమణీయంగా సాగింది. స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేసి అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. కల్యాణకట్టపై ప్రతిష్ఠించి మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గొప్పలు చెప్పడం కాదు అభివృద్ధి ఏదీ?



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు బస్వరాజ్ గౌడ్

భూత్పూర్: గొప్పలు చెప్పడం కాదు.. ఏడాదిలో ఏం అభివృద్ధి చేశారో చూపించాలని బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ ప్రశ్నించారు. ఆదివారం భూత్పూర్‌లోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కృషితో మండలంలో కప్పెట, రావులపల్లి, తాటికొండ, నర్సింగాపూర్‌తో పాటు తండాలకు వెళ్లేందుకు బీటీ రోడ్లను వేసినట్లు తెలిపారు. పోతులమడుగు వద్ద ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియం, హస్నాపూర్ నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే బీటీ రోడ్డుకు బీఆర్‌ఎస్ హయాంలోనే శంకుస్థాపన చేశారన్నారు. వాటిని తిరిగి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎం.సత్యనారాయణ, నారాయణగౌడ్, మురళీధర్ గౌడ్, రామురాథోడ్, నర్సింహులు, అశోక్‌గౌడ్, రాములు, సురేష్ గౌడ్, తిరుపతయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మకు పోటెత్తిన భక్తులు



నవాబుపేట: మండలంలోని మైసమ్మ దేవాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఏడాది ముగింపు రావటం, పెళ్లి ముహుర్తాలు ఇటీవలే పూర్తికావటంతో అమ్మవారి చెంతకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. మైసమ్మ దేవతకు భక్తులు బోనాలు, మొక్కులు చెల్లించుకొని నైవేద్యాలు సమర్పించారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి మాజీ మంత్రి పరామర్శ



నర్సింహులును పరామర్శిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని ఎదిరకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు నర్సిములు ఇటీవలే వాకింగ్‌కు వెళ్లినప్పుడు బైక్ ఢీకొని కాలు విరిగింది. చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న అతడిని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పడిపూజలకు హాజరు

జిల్లా కేంద్రంలోని పలువురు అయ్యప్ప మాలధారులు చేసిన పడిపూజలకు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. శ్రీనివాస్‌కాలనీలోని బీఆర్‌ఎస్ మున్సిపల్ కౌన్సిలర్ పటేల్‌ప్రవీణ్ నివాసంలో, సంజయ్‌నగర్‌లోని తిరుపతయ్య ఏర్పాటు చేసిన పడిపూజల్లో పాల్గొని గోవులకు పండ్లు తినిపించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సిములు, శివరాజు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయం వద్ద హోమం



అడ్డాకుల: మండలంలోని కందూర్ స్టేజీ సమీపంలో వెలిసిన శ్రీసాయిబాబా దేవాలయం వద్ద దత్తజయంతి వేడుకల సందర్భంగా ఆదివారం హోమం నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

రంగారెడ్డిగూడలో మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



అయ్యప్పస్వామి పడిపూజ చేస్తున్న అయ్యప్ప మాలధారులు

రాజాపూర్: మండలంలోని రంగారెడ్డిగూడలోని సంజీవ్ ముదిరాజ్‌స్వామి నివాసం వద్ద ఆదివారం అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. ఆ ప్రాంతమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. గురుస్వాములు ముందుగా గణపతిపూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. పలురకాల పండ్లు, పూలతో అలంకరించిన పదునెట్టాంబడిపై వెలిగించిన కర్పూరాన్ని వెలిగించారు. మాలధారులకు, భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

దేవరకద్ర: పట్టణంలోని చెన్నకేశవ స్వామి దేవాలయం సమీపంలో బాలరాజు స్వామి నివాసంలో అయ్యప్పస్వామి పడిపూజను ఘనంగా నిర్వహించారు. గురుస్వామి గోపాలకృష్ణస్వామి, కరణం రాజు స్వామి ఆధ్వర్యంలో పడిపూజను చేశారు.దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్నారు. స్వామివారికి పూజలుచేసి ఆశీర్వాదం తీసుకున్నారు.

శబరికి బయలుదేరిన అయ్యప్ప మాలధారులు



హన్వాడ నుంచి శబరికి బయలుదేరిన.

హన్వాడ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన అయ్యప్ప మాలధారులు ఆదివారం ఇరుముళ్లను కట్టుకుని శబరికి బయలుదేరి వెళ్లారు. గురుస్వాములు బాల్‌రాజ్ ఆధ్వర్యంలో 14మంది అయ్యప్ప మాలధారులు ఉదయమే ఆలయానికి చేరుకున్నారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. అనంతరం ఇరుముళ్లు కట్టుకొని ఉపవాస దీక్షలను విరమించారు. అనంతరం వాహనాల్లో శబరికి బయలుదేరారు. కార్యక్రమంలో కార్తీక్, చంద్రశేఖర్ గౌడ్, శ్రీనివాసులు, చిన్నస్వామి, మణికంఠ, వెంకట్‌నాయక్, చంటి, వెంకట్, సందీప్ పాల్గొన్నారు.

కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందాం

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



పీఏసీఎస్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తదితరులు

రాజాపూర్(బాలానగర్): పార్టీలను పక్కనపెట్టి కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బాలానగర్ మండల కేంద్రంలో రూ.75లక్షల నాబార్డు నిధులతో నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బాలానగర్ మండలానికి ఇప్పటికే రూ.1.50కోట్ల నిధులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే పార్టీలు పక్కనపెట్టి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. పీఏసీఎస్ భవనం ప్రహరీ కోసం మరో రూ.30 లక్షలు అవసరమని డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. తనకు ఇంకా నిధులు రాలేదని, వస్తే తప్పక సహాయం అందిస్తానని ఎమ్మెల్సీ చెప్పారు. డైరెక్టర్లు ప్రతాప్, రాజు, నాయకులు వెంకట్‌రెడ్డి, శంకర్, బచ్చిరెడ్డి, మోహన్‌రెడ్డి, మంజ్యానాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, యాదయ్య, వెంకట్‌రాములుగౌడ్ పాల్గొన్నారు.

దేవాలయానికి మాజీ ఎంపీ విరాళం

నవాబుపేట: మండలంలోని తూక్యాతండాలో కొత్తగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయానికి మాజీ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి రూ.2లక్షలు విరాళం అందించారు. ఆదివారం గ్రామస్థులు హైదరాబాద్‌లో ఆయనను కలిసి ఆలయ నిర్మాణానికి సహాయం చేయాల్సిందిగా కోరారు. దీంతో ఆయన రూ.2లక్షలు విరాళంగా ఇచ్చారు. మాజీ ఎంపీకి యన్మన్‌గండ్లకు చెందిన లక్ష్మయ్య, శేఖర్‌రెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ రాంచందర్ కృతజ్ఞతలు తెలిపారు.

రేపు పంచాయతీకార్మికుల చలో హైదరాబాద్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పంచాయతీ ఉద్యోగులు,, కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం మంగళవారం చలో హైదరాబాద్‌ను నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కురుమూర్తి, వెంకటేష్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా రూ.18వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో కార్యదర్శులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు వేయాలంటూ నేడు పాదయాత్ర

మహమ్మదాబాద్: మండలంలోని నంచర్ల గేట్ నుంచి జూలపల్లి వరకు రోడ్డు వేయాలంటూ గ్రామస్తులు సోమవారం పాదయాత్ర చేస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సింహులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 సంవత్సరాల క్రితం నిర్మించిన రోడ్డు కంకరతేలి గుంతలమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అన్ని పార్టీల నాయకులు, ప్రజలు కలిసి పాదయాత్ర చేసేందుకు సిద్ధమయ్యా రన్నారు. ఈదారిలోని అన్నిగ్రామాల ప్రజలు పాదయాత్రకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

దుమ్ముతో దుకాణాలు నడపలేకపోతున్నాం

- వ్యాపారుల ఆందోళన



మహమ్మదాబాద్: మహబూబ్‌నగర్ చించోలీ ఎన్‌హెచ్167 హైవే నిర్మాణ పనుల కోసం వెళ్తున్న వాహనాలతో లేస్తున్న దుమ్ముతో దుకాణాలు నడపలేకపోతున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆదివారం వారు ఆందోళన చేపట్టారు. వాహనాలు వెళ్తున్న సమయంలో దుకాణదారులు, వాహనచోదకులు అవస్థలు పడుతున్నారన్నారు. కాంట్రాక్టర్లు రోడ్డుకు నీళ్లు పట్టకపోవడంతో దుమ్ములేచి దుకాణాలు తెరవలేని పరిస్థితి నెలకొందని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని, దుమ్ము లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.

హైవేపై వాహనాల ‘వరుస’



అడ్డాకుల: మండలంలోని ఎస్ఎస్‌వీ స్పిన్నింగ్ మిల్లు ముందు పత్తి వాహనాలు వరుస కట్టాయి. సీసీఐ ఆధ్వర్యంలో ఇక్కడ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. దీంతో పెద్దఎత్తున పత్తి వాహనాలు ఇక్కడి వస్తున్నాయి. ప్రతి శని, ఆదివారాలు సెలవు దినం కావడంతో సోమవారం జరిగే పత్తి కొనుగోళ్ల కోసం రైతులు తమ వాహనాలను ఆదివారమే మిల్లు వద్దకు తెచ్చి వరుసలో ఉంచుతున్నారు. సాయంత్రం మిల్లు ముందు వాహనాల సంఖ్య ఎక్కువై 44వ నంబర్ జాతీయ రహదారిపై వాహనాలు వరుస కట్టాయి. సుమారు అర కిలోమీటర్ మేర వాహనాలు నిలిచి పోయాయి. మిల్లు ముందు నిలిచిన పత్తి వాహనాల వద్ద రైతులు రాత్రివేళ చలికి పడిగాపులు కాస్తున్నారు.